క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పుగూడ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు, నీలం సెంటర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు, అన్సారీ రోడ్డు ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కార్వాన్ టికెట్‌ను గంగపుత్రులకు కేటాయించాలి

గోల్కొండ: టికెట్ల కేటాయింపులో బీజేపీ అన్ని కులాల వారికి ప్రాధాన్యం ఇస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. కార్వాన్ నియోజకవర్గం బీజేపీ సీటును గంగపుత్ర సోదరులు, సీనియర్ బీజేపీ నాయకులైన గూడబోయిన శివరత్నంకు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర గంగపుత్ర సంఘం నాయకులు బుధవారం కేంద్ర మంత్రిని కలిశారు. తమ నాయకుడికి ప్రజల్లో మంచి అభిప్రాయం ఉందని తమకు టికెట్ కేటాయిస్తే గెలిచి తీరుతామని వారు కేంద్ర మంత్రితో అన్నారు.

తలసానికి శుభాకాంక్షలు



చార్మినార్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు సనత్‌నగర్ నియోజక వర్గం నుంచి పార్టీ టిక్కెట్ లభించడం పట్ల పాతబస్తీకి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు సుంకరి రవీందర్,గోపాల్ యాదవ్ తదితరుల బృందం బుధవారం ఆయనను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

గోల్కొండ: తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్‌లోని బంజావాడలో మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలు ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటిస్తున్నాయని అయితే అభ్యర్థుల ప్రకటన ప్రజలను మభ్యపెట్టడానికే అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని మినహాయిస్తే దేశంలోని ఇతర పార్టీలన్ని అవినీతి ఊబిలో కూరుకుపోయి ఉన్నాయన్నారు.


ఇంటింటికి బీజేపీ



స్థానికులతో బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికలు బీఆర్ఎస్‌కు చివరి ఎన్నికలు అని బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన బీజేపీ సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. కొంత కాలంగా బీఆర్ఎస్ ఓటరు లిస్టులో ఎన్నో అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లను తనిఖీ చేసుకోవాలని అన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఎస్సీలకు న్యాయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్వాన్ అభ్యర్థి ఏ.కృష్ణయ్య

గోల్కొండ: బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణలో ఎస్సీలకు సరైన న్యాయం జరిగిందని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ అభ్యర్థిగా ఎంపికైన ఏ.కృష్ణయ్య అలియాస్ మిత్ర కృష్ణ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల అండతో కార్వాన్‌లో గెలిచి తీరుతామని ఆయన అన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు శివరాత్రి రాములు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ జి.శంకర్ రాజు

విజయనగర్‌కాలనీ: నిత్యం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సూచించారు. బుధవారం విజయనగర్ కాలనీలోని సెయింట్‌ఆన్స్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినీలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ సిస్టర్ ఆరోగ్యమేరి, రోజీ ఫ్రాన్సిస్, ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.



చంద్రయాన్ విజయంతో శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయంలో పూజలు



గుడిమల్కాపూర్‌లో చంద్రయాన్ విజయ యాత్రలో బీజేపీ నాయకులు టి.అమర్‌సింగ్ తదితరులు



విద్యార్థులతో కలిసి టీవీలో చంద్రయాన్‌ను వీక్షిస్తున్న బీజేపీ నాయకులు దేవరవంశీ

చంద్రయాన్ విజయంతో సంబరాలు

గోల్కొండ: చంద్రయాన్ విజయంతో అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలకు అతీతంగా గుడిమల్కాపూర్, టోలిచౌకీ, నానల్‌నగర్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో చంద్రయాన్ విజయయాత్రలు నిర్వహించారు. గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులు టి.అమర్‌సింగ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పట్టుకొని విజయయాత్ర నిర్వహించారు. బీజేపీ నాయకుడు దేవర వంశీ గుడిమల్కాపూర్‌లోని పాఠశాలలో విద్యార్థులతో కలిసి చంద్రయాన్ ప్రత్యక్ష ప్రసారాన్ని టీవీలో వీక్షించారు. కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.



జియాగూడలో బీజేపీ నాయకుల సంబరాలు..



మీరాలంమండి మహాంకాళేశ్వర దేవాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు



హరిబౌలి చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు

ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో రాష్ట్రవ్యాప్తంగా ఏఎన్‌ఎంల పోస్టుల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కోఠిలోని డీఎంహెచ్ఎస్ వద్ద ఏఎన్‌ఎంలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే జులకంటి రంగారెడ్డి హాజరై మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రులు జోక్యం చేసుకుని ఏఎన్‌ఎంలను యదావిధిగారెగ్యులర్ చేయాలని కోరారు. గత 20 సంవత్సరాలుగా సేవలందించిన ఏఎన్‌ఎంల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి ఉందన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించన వారిని రెగ్యులర్ చేయడం న్యాయమైన విషయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్, గౌరవ అధ్యక్షులు భూపాల్, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్ పాల్గొన్నారు.



కోఠి డీఎంహెచ్ఎస్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

ర్యాగింగ్ చేసి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ.మన్నె శ్వేత

సుల్తాన్‌బజార్: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సుల్తాన్ బజార్ ఎస్ఐ మన్నె శ్వేత సూచించారు. బుధవారం హనుమాన్ టేక్డీలోని ప్రగతి మహా విద్యాలయంలో ఆ సంస్థ ఏర్పాటు చేసిన యాంటీ ర్యాగింగ్ కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు కిరణ్‌కుమార్, నరేష్, శ్వేతలు విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... విద్యార్థి దశలో విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కీలక సమయంలో ర్యాగింగ్‌కు పాల్పడి శిక్షలకు గురికావద్దని సూచించారు.

తహసీల్దార్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

గోల్కొండ: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే వారికి అధికారులు అందుబాటులో ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. షేక్‌పేట్ తహసీల్దార్‌గా నియమితులైన తహసీల్దార్ అనితరెడ్డి బుధవారం కార్వాన్ ఎమ్మెల్యేను టోలిచౌకీ మెరాజ్ కాలనీలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.ప్రజల ఫిర్యాదులపై స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.



గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సుల్తాన్‌బజార్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకాన్ని ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ సూచించారు. బుధవారం నియోజకవర్గంలోని పలు డివిజన్లలో గృహలక్ష్మీ పథకంపై ఆయన ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..... ప్రభుత్వం పేదలకు పక్కాఇల్లు ఉండాలనే సదుద్దేశంతో ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

గోషామహల్ కాంగ్రెస్ టికెట్టుకు సీకే మూర్తి దరఖాస్తు



టీపీసీసీ ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న సికె.మూర్తి

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్టు కోసం సీనియర్ కాంగ్రెస్ నాయకులు సికె.మూర్తి దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డికి సికె.మూర్తి తన కుమార్తె రమ్యతో కలిసి దరఖాస్తు అందించారు. కార్యక్రమంలో వెంకటేష్, కైలాష్ సింగ్, అశోక్ యాదవ్, బుచ్చి కాక, అరవింద్, సంజీవ్, ఆకాష్, పాండు, అరుణ్‌సింగ్‌లు పాల్గొన్నారు.

కురుమలకు ప్రాధాన్యత ఇవ్వని పార్టీలను భూస్థాపితం చేస్తాం

అఫ్జల్‌గంజ్: కురుమ కులస్తులకు రాజకీయంగా చట్ట సభల్లో ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయింపులో తగిన ప్రాధాన్యత ఇవ్వని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి వచ్చి భూస్థాపితం చేస్తామని తెలంగాణ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు కౌశిక శ్రీనివాస్ రావు, మిర్రర్ శ్రీనాథ్, మాధారం కృష్ణలు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం అఫ్జల్‌గంజ్‌లోని కురుమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు 40 లక్షలకు పైగా జనాభా ఉన్న కురుమలకు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన 115 స్థానాల్లో ఒక సీటు కూడా కురుమలకు కేటాయించకపోవడం తమ కులాన్ని చిన్నచూపు చూడటమేనని వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ కేవలం తమ పార్టీ పెద్ద అయిన యెగ్గె మల్లేషంకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టి చేతులు దులుపుకుందన్నారు. ఈ విషయపై యెగ్గె మల్లేషం స్పందించి బీఆర్ఎస్ పార్టీ కురుమలకు చేసిన అన్యాయంపై అధికారికంగా ఖండించాలని డిమాండ్ చేశారు.

రెండోసారి టిక్కెట్ కేటాయింపుపై ధన్యవాదాలు

చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున రెండోసారి తనకే టిక్కెట్ కేటాయించినందుకు హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీని కలిసి సలావుద్దీన్ లోధీ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ చార్మినార్ ఇంచార్జిగా కొనసాగుతున్న ఆయన బుధవారం మంత్రి మహమూద్ అలీని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి ఘనంగా సత్కరించారు.



హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీని కలిసి సత్కరిస్తున్న సలావుద్దీన్ లోధీ

బీజేపి బీసీలకు 50 శాతం అసెంబ్లీ టిక్కెట్లు కేటాయించాలి

అఫ్జల్‌గంజ్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బీసీలకు 50 శాతం టిక్కెట్లు కేటాయించాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కుమార్‌ను ఓబీసీ మోర్చా జాతీయ సోషల్ మీడియా ప్రతినిధి పెరిక సురేష్ కోరారు. బుధవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు.బీసీలకు అత్యధిక స్థానాలు ఇవ్వడం ద్వారా ఎక్కువ స్థానాల్లో విజయం సాధించవచ్చని, రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు పార్టీలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

బీఆర్ఎస్ హయంలోనే అన్నివర్గాల అభివృద్ధి



మహేశ్వరీ సమాజ్ అధ్యక్షులు రాకేష్ దాలియాను సత్కరించిన ఆశీష్‌కుమార్ యాదవ్

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోనే అన్నివర్గాల ప్రజల ప్రగతి, అభివృద్ధి కొనసాగుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పలు సమాజ్‌లకు ప్రభుత్వ స్థలాలు అప్పగించి ఆత్మగౌరవ భవనాలు కూడా నిర్మించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బేగంబజార్‌లో మహేశ్వరీ సమాజ్ అధ్యక్షులు రాకేష్ దాలియాను ఆయన కలిసి బీఆర్ఎస్‌కు మద్ధతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గద్దర్ సంస్మరణ సభ



సభలో మాట్లాడుతున్న ఏపూరి సోమన్న

నాంపల్లి: ప్రజా యుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభ బుధవారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నందమూరి తారక రామారావుకళా మందిరంలో జరిగింది. గద్దర్ సంస్మరణ కమిటీ ఆధ్వర్యంలో గద్దర్ కుమారుడు సూర్య కిరణ్, కుమార్తె వెన్నెల సమక్షంలో నిర్వహించారు. కవులు, కళాకారులు, రచయితలు, గాయకులు, కళాకారులు హాజరయ్యారు. గద్దర్ యాదిలో... శీర్షికన నిర్వహించిన సభలో వివేక్ వెంకటస్వామి, కె.జయరాజు, జె.బి.రాజు, మచ్చ దేవేందర్, ఏపూరి సోమన్న, పాశం యాదగిరి, బి.ఎస్.రాములు, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ కె.ఐలయ్య, యశ్‌పాల్, చెన్నమనేని బాల కిషన్ రావు హాజరై ప్రసంగించారు.

ముప్పిడి సీతారాంరెడ్డికి సన్మానం



చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ పార్టీ చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి ముప్పిడి సీతారాంరెడ్డి ఎంపిక కావడం పట్ల ఆ పార్టీ ఉప్పుగూడ డివిజన్ ఉపాధ్యక్షుడు కంకణాల బ్రహ్మచారి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్టీ నాయకులు మల్లేష్ యాదవ్, బాల్‌రాజు, వెంకటేష్ గుప్తా, ఎమ్మార్పీఎస్ నాయకులు సాప కృష్ణ, గడుసు సాయిలు సత్కరించారు.

ప్రపంచంలోనే భారత్ నెం-1

అబిడ్స్: చంద్రాయన్-3 చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టి భారత్ ప్రపంచంలోనే నెంబర్ వన్ దేశంగా మారిందని టీఎస్జీటీఏ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, సేవారత్న డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. టీఎస్జీటీఏ కార్యాలయంలో చంద్రుడిపై చంద్రాయన్-3 అడుగుపెట్టిన సందేశాలను టీవీలో చూసి పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. అనంతరం డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..... 140 కోట్ల భారతీయుల ఆశలు ఫలించిన శుభదినమన్నారు. కార్యక్రమంలో విక్రమ్‌కుమార్, కేఆర్.రాజ్‌కుమార్, వైదిక్ శాస్త్రీ, శ్రీధర్, ముఖీమ్, తదితరులు పాల్గొన్నారు.



చంద్రాయన్-3 ల్యాండింగ్‌ను వీక్షిస్తున్న టీఎస్జీటీఏ అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

పర్యావరణ పరిరక్షణతోనే సుస్థిరాభివృద్ధి



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్



సదస్సులో పాల్గొన్న ప్రముఖ పర్యావరణవేత్త ఆచార్య పురుషోత్తం రెడ్డి సన్మానిస్తున్న నిర్వాహకులు

చార్మినార్: సామాజిక శాస్త్రాల అధ్యయనం పర్యావరణ పరిరక్షణ దృష్టికోణంలో జరగాలని.. అప్పుడే మానవ సమాజం ఆరోగ్యవంతంగా ఉండటమే కాక ఆర్థికాభివృద్ధి సాధించగలదని ప్రముఖ పర్యావరణ వేత్త ఆచార్య పురుషోత్తం రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల రాజనీతి శాస్త్రం, పరిపాలన విభాగాల ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సులో రెండో రోజు పురుషోత్తం రెడ్డి వక్తగా పాల్గొన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రధానమైందని... ప్రపంచ యుద్ధాలు నాటి నుంచి నేటి వరకు పర్యావరణంలో ఏర్పడుతున్న మార్పులు జీవ వైవిధ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయని... సామాజిక శాస్త్రవేత్తలు ఈ విషయంపై విస్తృతంగా చర్చించి తగిన పరిష్కారాలతో ముందుకు రావాలన్నారు. డాక్టర్ వనమాల మాట్లాడుతూ... మానవ సమాజ అభివృద్ధికి శాస్త్రవేత్తలు నిర్మాణాత్మక సూచనలు చేయాలన్నారు. ఆచార్య శ్రీనివాస రెడ్డి తమ ప్రసంగంలో సామాజిక జీవనంలో వస్తున్న మార్పులు వలన ఏర్పడుతున్న సంక్షోభాన్ని నివారించే దిశగా సదస్సులో పత్ర సమర్పకులు చర్చించాలన్నారు. న్యూజిలాండ్ నుంచి సీనియర్ ప్రొఫెసర్ డెబలీన జూమ్ ద్వారా మాట్లాడారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

యాకుత్‌పురా: పర్యావరణని పెంపొందించేందుకు డివిజన్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. డివిజన్ పరిధిలోని యాకుత్‌పురా రైల్వే స్టేషన్ రోడ్డు, జఫర్ రోడ్డు, ఎస్ఆర్టీ కాలనీ, రెయిన్‌బజార్, సూపర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... తమ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం చేప్పటామన్నారు.

పేదలకు అండగా ఉప్పల ఫౌండేషన్



పుస్తె మెట్టెలు, ఇతర సామాగ్రి అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా, సదానందం గుప్తాలు

అబిడ్స్: నిరుపేదల పెళ్లిలకు ఉప్పల ఫౌండేషన్ అండగా ఉండి నిరంతరం వారికి సేవలు చేస్తుందని ఫౌండేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. పాతబస్తీకి చెందిన పలువురి పెళ్లిలకు ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తె మెట్టెలు, చీర, గాజులను విరాళంగా అందించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.... తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవితాంతం సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఎన్.సి. సంతోష్, కైలాష్, ప్రభాకర్, నాగేంద్ర, పొత్తునూరి సంపత్, నోముల రాజీవ్‌గౌడ్, పద్మాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్యానికి పరిషత్ సముచిత గౌరవం

సుల్తాన్‌బజార్: తెలంగాణ సాహిత్య వికాసానికి దోహదం చేసే రచనలకు సారస్వత పరిషత్ సముచిత గౌరవం కల్పిస్తుందని పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. బుధవారం బొగ్గులకుంటలోని పరిషత్ ఆడిటోరియంలో 6 మంది ప్రముఖులకు పరిషత్ తరపున ధర్మనిధి సాహిత్య పురస్కారాలు ప్రదానం చేశారు. ఒకొక్కరికి రూ.5 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.... పరిషత్ 80 ఏళ్లుగా తెలంగాణకు పెద్ద పీట వేస్తూ వచ్చిందని, 2015 సంవత్సరంలో తెలంగాణ సారస్వత పరిషత్‌గా పేరుమార్పు చేసిన అనంతరం సంపూర్ణంగా తెలంగాణ సాంస్కృతిక వికాసానికి అంకితమైందని తెలిపారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపాన్యాసం చేశారు.



ప్రముఖులకు పురస్కారాలు అందజేస్తున్న పరిషత్ ప్రతినిధులు

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



నియామక పత్రం అందుకుంటున్న కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్

చార్మినార్: ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అయిన తెలంగాణ స్టేట్ ఆటో అండ్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక కార్యదర్శిగా పాతబస్తీకి చెందిన కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఆటో అండ్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోధ మల్లేష్ గౌడ్ చేతుల మీదుగా బుధవారం ఆయన నియామక పత్రం అందుకున్నారు.

జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

దూద్‌బౌలి: జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులు తమకు వేతనాలు పెంచాలని... పర్మినెంట్ చేయాలని కోరుతూ సిటీ కాలేజీ చౌరస్తా వద్ద బుధవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కార్మిక విభాగం నాయకులు సి.శ్యామ్ కుమార్, కె. మనోజ్ కుమార్‌లు మాట్లాడుతూ...ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సి.శ్యామ్ కుమార్, కె. మనోజ్ కుమార్‌లు

చార్మినార్ యునానీ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యేలు



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ,ముంతాజ్ అహ్మద్ ఖాన్

చార్మినార్: చార్మినార్‌లోని ప్రభుత్వ యునానీ ఆసుపత్రిని బుధవారం మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీతో పాటు ముంతాజ్‌ఖాన్‌లు సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆసుపత్రి భవనం పై కప్పు నుంచి వర్షం నీరు వార్డుల్లోకి కురవడంతో రోగులు పడరాని పాట్లు పడ్డారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్న యునానీ ఆసుపత్రి భవనానికి మరమ్మత్తులు చేసి రోగులకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని సంబందిత వైద్య సిబ్బంది ఎమ్మెల్యేలను కోరారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులతో పాటు ఫార్మసీ విభాగం,గైనిక్ వార్డు,ఓపీలను వారు పరిశీలించారు. అనంతరం పాతబస్తీలోని కామాటిపురా తదితర ఏరియా ఆసుపత్రులను సందర్శించి అక్కడి పరిస్థితులను సంబందిత వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలలో పత్తర్‌గట్టి కార్పొరేటర్ సొహేల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

కత్తితో సంచరిస్తున్న ఇద్దరికి జైలు

డబీర్‌పురా: అనుమానాస్పదంగా కత్తితో సంచరిస్తున్న ఇద్దరికి బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్. లక్ష్మణ్ రావు 20 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం... మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎతేబార్‌చౌక్ క్రాస్ రోడ్డు వద్ద ఈ నెల 22వ తేదీన సాయంత్రం 7 గంటల సమయంలో ఎస్సై నరసింహా సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. యాకుత్‌పురా నుంచి సయ్యద్ షకీలుద్దీన్, మహ్మద్ జుబేర్‌లు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకొని తనిఖీలు చేయగా కత్తి లభించింది. దీంతో వారిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా రౌడీషీటర్‌ను కలిసేందుకు వెళుతున్నట్లు తెలిపారు. దీంతో వీరిపై పోలీసులు వారిపై కేసు నమోదు చేసి బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు వారికి 20 రోజుల రోజు సాధారణ జైలు శిక్ష విధించారు. దీంతో పోలీసులు షకీలుద్దీన్, జుబేర్‌లను జైలుకు తరలించారు.

హోటల్ నిర్వాహకుడికి జైలు శిక్ష

విజయనగర్‌కాలనీ: నిబంధనలను అతిక్రమించి అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా హోటల్ నిర్వహిస్తునన ఓ వ్యక్తికి జైలు శిక్ష విధించారు. ఈ సంఘటన బుధవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. కార్వాన్ టప్పాచబుత్రా ప్రాంతానికి చెందిన మహ్మద్ అవైజుద్దీన్(40) మెహిదీపట్నం ప్రధాన బస్టాప్ వద్ద సిటీ డైమాండ్ పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత కూడా హోటల్ నిర్వహిస్తుండడంతో అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నాంపల్లి నాల్గవ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ డి.రాజేందర్‌కుమార్ నిందితునికి 3 రోజుల జైలు శిక్ష విధించారు.